క్లుప్తంగా

మీ-సేవ నిర్వాహకుడిపై ఫిర్యాదు

కలికిరి : పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం సమీపంలోని మీ-సేవ కేంద్రం నిర్వాహకుడిపై స్థానికులు జిల్లా కలెక్టరుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. నిర్వాహకుడు అధికారికంగా మీ-సేవ కేంద్రంలో కాకుండా మరోచోట నిర్వహిస్తూ వివిధ రకాల సేవలకు ప్రజల నుంచి అధిక వసూళ్లు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న మీ-సేవ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



నూతన బోరును ప్రారంభిస్తున్న రాకేష్‌రెడ్డి

పీలేరు : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు యువ పారిశ్రామిక వేత్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు జీ.వి. రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక చిత్తూరు రోడ్డు, బాపూజీనగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించడం తోపాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాపూజీ నగర్‌లో రూ. 2 లక్షలతో బోరుకు కొత్తగా మోటారు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, జయచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, ఉదయ్‌కుమార్, షాకీర్, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, కాలనీచిన్న, ఎం. అరుణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు



ప్రజలకు సూచనలిస్తున్న న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్

తంబళ్లపల్లె : గ్రామీణ ప్రజలు మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయని మండల న్యాయసేవ అధికార సంఘం అధ్యక్షులు, స్థానిక న్యాయమూర్తి ఉమర్ ఫరూఖ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రాగిమాను రచ్చవద్ద మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మత్తు పదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరమన్నారు. యువత డ్రగ్స్, పాన్ మసాలా, గుట్కా, గంజాయి వంటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్ధలింగారెడ్డి, షరీఫ్, ఫోర్టు సంస్థ ప్రతినిధి నరసింహులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కవిత

ములకలచెరువు : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కవిత కోరారు. మంగళవారం మోడల్‌స్కూల్‌లో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ... గత విద్యా సంవత్సరంలో పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించి మండలం మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థి పోటాపోటీగా చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు.

ఎంపీ నిధులతో ఆర్యవైశ్య శ్మశానానికి ప్రహరీ

కలికిరి : మండల కేంద్రం సమీపంలోని ఆర్య వైశ్య శ్మశాన వాటిక ప్రహరీ ఏర్పాటుకు ఎంపీ నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు ఆ సంఘం నేతలు తెలిపారు. ఇటీవల రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్‌రెడ్డిని కలిసిన ఆర్యవైశ్య సంఘం నేతలు శ్మశాన వాటిక అభివృద్ధికి గాను బోరు, ప్రహరీ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని విన్నవించారు. ఎంపీ ఆదేశాల మేరకు మండల పరిషత్ నిధుల నుంచి బోరు వేయించారు. ఇప్పుడు ప్రహరీ ఏర్పాటుకు రూ.2లక్షలు నిధులు కేటాయించారు.

ఘనంగా బంకిం చంద్ర ఛటర్జీ జయంతి

వాల్మీకిపురం: వందేమాతరం గీత రచయిత బంకిం చంద్ర ఛటర్జీ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని గండబోయనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బంకిం చంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి
- మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి
- టీడీపీ కౌన్సిలర్ గీతశ్రీ రాజీనామా ఆమోదం



ప్రజాసమస్యలను ఛైర్‌పర్సన్‌కు వివరిస్తున్న మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జింకాచలపతి

మదనపల్లె : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందని లబ్ధిదారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి చెప్పారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ... జగనన్న సురక్షకు సంబంధించి పట్టణంలోని అన్ని వార్డుల్లో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. జూలై 1 నుంచి అన్ని వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిలో 11 రకాల సేవలు, ధృవీకరణపత్రాల జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలు వసూలు చేయరని చెప్పారు. ఏ రోజు ఏ వార్డు సచివాలయం పరిధిలో క్యాంపు నిర్వహిస్తున్నారో అందరికీ తెలిసేలా వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ప్రజలందరూ క్యాంపులకు హాజరై ప్రభుత్వ సేవలు పొందేలా చూడాలన్నారు. అనంతరం అజెండాలోని 25 అంశాలను సభ్యుల అంగీకారం కోసం చదివి వినిపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ...పట్టణంలోని పలు హిందూ శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. మున్సిపాలిటీలోని శానిటరీ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంబంధించి ఈపీఎఫ్ చెల్లింపు ఇప్పటికే ఆలస్యమైందని, త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వార్డుల్లో ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి వలంటీర్లు వినియోగించేందుకు బయోమెట్రిక్ డివైజ్‌లు అత్యవసరమైనందున తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. మాజీ సైనికులకు ఇంటిపన్ను మినహాయింపుకు సంబంధించిన నిబంధనలపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించి, పట్టణంలో అర్హత కలిగిన మాజీసైనికుల ఇళ్లకు వర్తింపజేయాల్సిందిగా కోరారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నూర్‌ఆజం మాట్లాడుతూ.. తన వార్డులో రూ.12లక్షలతో అభివృద్ధి పనులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. 22వవార్డు కౌన్సిలర్ ముబీనా మాట్లాడుతూ.. తమ వార్డులో బాహుదా కాలువపై నిర్మిస్తున్న కల్వర్టు రెండునెలలుగా అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పనులు పూర్తిచేయాలన్నారు. సంతగేటులో పారిశుధ్య నిర్వహణకు వార్డు శానిటరీ కార్మికులను కేటాయిస్తున్నందున స్థానికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. గాంధీపురంలో 4రోజులకు ఒకసారి నీటిసరఫరా జరుగుతోందని, ప్రజల అవసరాల దృష్ట్యా రోజు విడిచి రోజు పంపిణీ చేయాల్సిందిగా కౌన్సిలర్ రేణుక కోరారు. అలాగే తమ వార్డులో ఓ మున్సిపల్ ఉద్యోగి ఇంట్లో కుక్కల పెంపకంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాల్సిందిగా కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. 8వవార్డు టీడీపీ కౌన్సిలర్ గీతశ్రీకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్స్‌కు ఉద్యోగావకాశాల్లో భాగంగా నిమ్మనపల్లె మండలం బోడుమల్లువారిపల్లెలో టీచర్‌గా ఉద్యోగం వచ్చినందున ఆమె సమర్పించిన రాజీనామాను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. దీంతో మున్సిపాలిటీలో టీడీపీకి కేవలం ఒకే ఒక కౌన్సిలర్ మిగిలారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, డీఈ బండపల్లిశిరీషా, ఏఈ స్నేహప్రియ, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధర్ రావు

వాల్మీకిపురం : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాత్రి గస్తీ ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా అరికట్టాలన్నారు. ఎర్రచందనం, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల తనిఖీ ముమ్మరం చేసి, ప్రతి ఒక్క ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ వాడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న పాత పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. సీఐ సురేష్ కుమార్, ఎస్సై నాగేశ్వర రావు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన కల్పించాలి

కలకడ : మండలంలో మహిళా సమస్యల నివారణకు దిశ యాప్‌పై అవగాహన పెంచాలని ఎస్ఐ సిటిస్వామి సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో సచివాలయ మహిళా పోలీస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల వారిగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో నేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల పర్యటనలు, కదలికలపై నిఘా పెట్టాలన్నారు. నాటు సారా తయారీ, క్రయ విక్రయాలపై పూర్తి సమాచారం సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాలక్రిష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ములకలచెరువు : రోడ్డుకు ఇరువైపుల తోపుడు బండ్లు, వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గాయత్రి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని బురకాయలకోట బస్టాండులో ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులకు తరలించరాదని సూచించారు. వాహనాలకు రికార్డులు తప్పనిసరి అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకే అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

సర్వే నగదు ఇవ్వలేదని డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు

మదనపల్లె : గతంలో చేసిన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) సర్వేకు సంబంధించి తమకు నగదు చెల్లించలేదని ఆశా కార్యకర్తలు మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మికి ఫిర్యాదు చేశారు. జిల్లా ఆస్పత్రికి చేరుకుని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో రెండు లెప్రసీ సర్వేలు పూర్తిచేశామని, అయితే ఒకసర్వేకు మాత్రమే నగదు చెల్లించారని, మరోసర్వేకు ఇంతవరకు చెల్లించలేదన్నారు.

కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ బడులు



మాట్లాడుతున్న ఎంఈఓ హేమలత

రామసముద్రం : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులలో విద్య, మౌలిక వసతులు ఉన్నాయని ఎంఈఓ హేమలత తెలిపారు. మంగళవారం రామసముద్రం తూర్పు పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన పథకాలతో ఎంతో లబ్ధి పొందుతున్నారని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమం క్రింద పాఠశాల ఎంపిక కావడంతో రూ.12.51 లక్షలు మంజూరు కావడం, పాఠశాలకు అవసరమైన కుర్చీలు, ఫ్యాన్లు, స్మార్ట్ టీవీ, పెయింటింగ్ చేయించామన్నారు. అలాగే అమ్మ ఒడి పథకం ద్వారా నాలుగేళ్లుగా 186 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. ఇంక జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్దతో పిల్లలకు నాణ్యమైన పోషకాహారంతో పాటు పోర్టిఫైడ్ రైస్, గుడ్లు, చిక్కీలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేవీపల్లె : పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న ఆణిముత్యాలు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు సద్వినయోగం చేసుకుని బాగా చదవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమష్టి కృషి అవసరమన్నారు. అనంతరం చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సూర్యనారాయణ, సర్పంచ్ రెడ్డెప్ప, ప్రిన్సిపాల్ జె. సురేష్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీకేఆర్‌పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చంద్రయ్య అధ్యక్షతన పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.

పెద్దతిప్పసముద్రం : ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పించిందని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లలో మంగళవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ స్కూళ్ల రూపు రేఖలు మార్చేశారన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ఎంఈఓ నారాయణ వివరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఎన్‌సీడీసీడీ సర్వే లక్ష్యాలను సాధించాలి



వైద్య సిబ్బంది పని తీరును ఆరాతీస్తున్న నోడల్ అధికారి శేషగిరిబాబు

పెద్దతిప్పసముద్రం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే సిబ్బంది ఎన్‌సీడీసీడీ సర్వే లక్ష్యాలను వంద శాతం సాధించేలా చూడాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శేషగిరి బాబు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కందుకూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో సమీక్షించారు. దేశంలోని ప్రతి వ్యక్తికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ సమీపంలోని గ్రామ సచివాలయంలో హెల్త్ ఐడీ కార్డుకు ఆధార్ నంబర్ లింక్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. దేశ వ్యాప్తంగా ఒకే ఐడీ నంబర్‌తో రోగి ఆరోగ్య పరిస్థితిని ఆన్‌లైన్ చేయబడుతుందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బంది పని తీరును డాక్టర్ అభిలాష్, అశోక్ చైతన్యలను అడిగి తెలుసుకున్నారు.

వంద శాతం లక్ష్యాలను సాధించాలి

ములకలచెరువు : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో వంద శాతం లక్ష్యాలను సాధించాలని ఆరోగ్య సిబ్బందికి జిల్లా ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ శేషగిరి బాబు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య పథకాలపై సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్సీ, సిబ్బంది రఫీ, రమణ తదితరులు ఉన్నారు.

మొరుసు కాపుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమావేశంలో మొరుసు కాపులు

బి.కొత్తకోట : కెంపేగౌడ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని మొరుసు కాపులు (వక్కలిగర గౌడ్)లు బి.కొత్తకోటలో మంగళవారం ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. టమాటా మార్కెట్ నుంచి బైక్ ర్యాలీలో పాల్గొని స్థానిక జ్యోతి చౌక్‌లో కెంపేగౌడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్య సామంతరాజు, బెంగళూరు మహా నగర నిర్మాత కెంపేగౌడ జీవిత చరిత్రను క్షుణంగా వివరిస్తూ కొనియాడారు. 33 జీవో ప్రకారం మొరుసు కాపులకు బీసీ-బీ ధ్రువీకరణ పత్రాల సాధన కోసం మనమంతా కలసి కట్టుగా ఉంటూ భావి తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో 80 వేల మంది మొరుసు కాపులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, పీ.శ్రీనాథ్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి, ఎల్ఐసీ మద్దిరెడ్డి, దాదం లోకనాథ్‌రెడ్డి, మొరుంపల్లి రమేష్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, డీఎం మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ కొత్తరెడ్డివారిపల్లి, రెడ్డివారిపల్లి, వాల్మీకిపురం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రానివారు తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, జెడ్పీటీసీ నిర్మల, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, సర్పంచ్‌లు గంగులమ్మ, మునిభాస్కర్, నాయకులు నీళ్ల భాస్కర్, కేశవ రెడ్డి, ఆనంద రెడ్డి, శ్రీధర్‌రాయల్, రాయుడు, ఆనంద, చలపతి, కిట్టా, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే సేవలు



జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కురబలకోట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు ఇంటి వద్దకే వివిధ సేవలు అందుతాయని జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ ఏఓ మనోహర్ రాజు తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు, ఎంపీడీఓ దిలీప్‌కుమార్ ఇతర సిబ్బందికి సమీక్షలో దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ అపరిష్కృత సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జూలై ఒకటి నుండి 30 వరకు ప్రజలకు కావాల్సిన అన్ని రకాల సేవలను పొందవచ్చన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

కేవీపల్లె : సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పొత్తపు సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గ్యారంపల్లె, తీతవగుంటపల్లె, తువ్వపల్లె గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందాలన్న తపన, ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించాలన్న చిత్త శుద్ధితో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ రెడ్డెయ్య, దండు వెంకటరమణారెడ్డి, యల్లారెడ్డి, రాజన్న, వెంకటరమణనాయుడు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీఎల్‌డీవో లక్ష్మీపతి ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ సచివాలయ సిబ్బందితో కలసి మండలంలోని బూచిపల్లి, సంపతికోట పంచాయతీల్లో పర్యటించారు. వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకుని సమగ్రంగా నమోదు చేసుకోవాలన్నారు.

ప్రతి ఇంటికీ ఉచిత సేవలు

కలకడ : ప్రతి ఇంటికీ ఉచిత సేవలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కె.బాటవారిపల్లె సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

జగనన్న సురక్షపై శిక్షణ

రామసముద్రం : మండలంలో రామసముద్రం సచివాలయం 1, 2 మరియు ఎలవానెల్లూరు పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : బక్రీద్ పండుగను మతసామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఎస్పీ కేశవప్పతో కలిసి డివిజన్ స్థాయి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మదనపల్లె పట్టణం మతసామరస్యానికి ప్రతీక అని, ఇక్కడి ప్రజలు సహృదయత కలిగి ఉండి అందరితో సోదరభావంతో మెలుగుతుంటారన్నారు. ఇలాంటి సహకారాన్ని కలకాలం కొనసాగించాలన్నారు. బక్రీద్ పండుగను ఎవరికి, ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. సోషల్‌మీడియాలో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సున్నితమైన సమస్య వచ్చినా వెంటనే పోలీస్, రెవెన్యూశాఖ అధికారులకు తెలపాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ షేక్ మహబూబ్‌చాంద్, రఫీక్‌అహ్మద్, ఎంపీడీఓలు శేషగిరిరావు, భానుప్రసాద్, సీఐలు మహబూబ్‌బాషా, మురళీకృష్ణ, సాదిక్‌అలీ పాల్గొన్నారు.

నక్కలదిన్నెతండాలో కార్డెన్‌సెర్చ్

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నె తండాలో మంగళవారం వేకువజామున ఎస్ఈబీ, పోలీస్ ఆధ్వర్యంలో సంయుక్తంగా కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలపై ఆరా తీశారు. అలాగే రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. పోలీసు తనిఖీల్లో 380 సారా ప్యాకెట్లు, 80లీటర్ల నాటుసారా, 167 టెట్రా ప్యాకెట్ల కర్నాటక మద్యం, 3 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.